# భక్తి

భక్తియనగా ప్రేమ అని అర్థం. ప్రేమ అన్నచో ప్రేమించువాడు, ప్రేమింపబడువాడు ఉండవలెను. ప్రేమించువాడు భక్తుడు, ప్రేమింపబడువాడు భగవంతుడు. అయితే యీ ఇరువురూ శాశ్వతులనే ద్వైతభావనతో భక్తి ప్రచారములోనికి వచ్చుచున్నది. కాని, భక్తి యొక్క ఉద్దేశ్యం భక్తుని, భగవంతుని ఏకము చేయుటయే. అనగా శాశ్వతుడగు భగవంతునిలో అశాశ్వతుడగు భక్తుడు ఐక్యమగుటయే. సద్వస్తువగుటయే భక్తి. అనగా ఉన్నది ఉన్నట్లు అనుభూతమగుటయే భక్తి. అట్లు అనుభూతమగునదియే జ్ఞానము. కావున జ్ఞానానుభూతిని కలుగజేయునదియే భక్తి.

**మోక్ష కారణ సామగ్ర్యాం భక్తిరేవ గరీయసీ**
**స్వ స్వరూపాను సంధానం భక్తిరిత్యభిధీయతే (వివేకచూడామణి–32)**

మోక్షమును కలుగజేయు ఉపకరణములలో భక్తియే గొప్పది. అయితే, తన స్వరూపముతో తాను అనుసంధానమగుటయే భక్తి. అజ్ఞానముతో ద్వైత భావనతో భక్తి ప్రారంభమగును. అనగా బహిర్ముఖముగానున్న జీవుడు బహిర్ముఖముగానే ఈశ్వరుడు గలడని భావించి, నామరూపాత్మక కల్పిత విగ్రహాదుల నారాధించుచున్నాడు. ఈ బాహ్యారాధనలే నవవిధ భక్తిమార్గములైనవి.

**శ్రవణం కీర్తనం విష్ణోః స్మరణం పాదసేవనం అర్చనం వందనం దాస్యం సఖ్యమాత్మ నివేదనమ్.**

అయితే బాహ్యమునకు ఈ నవవిధ భక్తిమార్గములు వేరు వేరుగా కనిపించినప్పటికినీ, భక్తుడు తనను తాను సమర్పించుకొని, తనయొక్క అస్తిత్వము ఏమాత్రమూ లేకుండా, శాశ్వతంగా భగవదైక్యమగుటయే మూలసూత్రము. అనగా ప్రారంభంలో నవవిధములుగా కనిపించును. కాని, కాల క్రమేణా భక్తుడు బాహ్యము నుండి అంతరంలో ప్రవేశించి, తన లక్ష్యస్వరూపమగు భగవంతుని తనయందే ద్యోతకము చేసుకొనుచుండును. దీనినే అనన్యభక్తి యందురు. ఈ అనన్యభక్తి స్థాయికి చేరనంతవరకు, భక్తుడు మూఢనమ్మకములతో భగవంతుని నామరూపాత్మకంగానే భావించుచూ, సత్యమును గ్రహించలేక, జీవితాంతము ఈ మూఢవాసనా ముద్రలతో కాలయాపన చేసుకొనే ప్రమాదం గలదు. ఈ మూఢభక్తినుండి మరల్చబడవలయునన్న

తనలో సత్యాన్వేషణ, అందులకై సజ్జన సాంగత్యం చేయవలసిందే తప్ప తదన్యంగా ఈ అజ్ఞానపు ఉచ్చు నుండి బయటపడలేడు.

**కస్తరతి మాయా, కస్తరతి మాయా, యో మహానుభావం**
**సేవతే, సంగాత్యజతి, నిర్మమో భవతి** **(నారద భక్తి సూత్రములు 46-3.13)**

మాయనెవరు దాటగలరు? ఎవరు మహాత్ములను సేవించునో అతడే మమతాహంకారములు లేకుండా, ప్రకృతి యందు సంగం లేకుండా, తరించగలడు. కావున, బాహ్యభక్తి నుండి అనన్యభక్తికి చేరవలయునన్న సద్గురువు, సజ్జన సాంగత్యం అత్యంత అవసరం. ఇది లేకయే అధికశాతం భక్తులు బాహ్యభక్తితో జీవితాన్ని సరిపుచ్చుచున్నారు. భక్తియనగా ప్రేమయని చెప్పుకొంటిమి కదా! లోకంలో అందరూ భిన్న భిన్న వస్తువులపై ప్రేమ చూపింతురు. ముఖ్యంగా భార్య భర్తపై, భర్త భార్యపై, ఇరువురూ తమ సంతానంపై ఎక్కువగా ప్రేమ చూపుచుందురు. అయినప్పటికీ, మిక్కుటముగా ప్రేమించుచున్న భార్యాభర్తలలో లేదా సంతానములో ఎవరేని అగ్నిలో పడిపోవుటగాని, నూతిలో పడిపోవుటగాని సంభవించుట ప్రత్యక్షంగా తాను చూచుచుండిననూ, వారికోసమై తాము అగ్నిలో పడిపోవుటగాని, నూతిలో పడిపోవుటగాని చేయుటలేదు. అందులకు కారణం వారిపై కంటే అత్యంత మిక్కుటంగా గల ఇంకేదో వస్తువుపై మన ప్రేమ మనకు తెలియకుండానే కేంద్రీకృతమైయున్నది. అదియే మన ప్రాణము. కావున అందరూ సమానంగా అత్యంత గాఢంగా ప్రేమించుచున్నది ఎవరికి వారి ప్రాణమునే. ఆ ప్రాణము నిరంతరమూ తన శ్వాస ద్వారా బహిర్గతమగుచూనేయున్నది. అందరికీ ప్రాణభయమే ఉన్నది కాని ఆ ప్రాణాన్ని కాపాడుకొనే ప్రయత్నం చేయుటలేదు. తన ప్రాణాన్ని కాపాడుకొనే ప్రయత్నం చేయువారే నిజమైన ప్రేమికులు. వారే నిజమైన భక్తులు.

తన ప్రాణము ప్రతీ శ్వాసలో పోవుచున్నదని గ్రహించి, దానిని తనలో నిలుపుకొనే విధము తెలుసుకొని, అట్టి ప్రయత్నము చేయుచున్న మహాత్ములనే సేవించవలసియున్నది. వారే యోగులు. అట్టి యోగులద్వారానే బాహ్యభక్తి అనన్యభక్తిగా మారుచున్నది. కావున సామాన్య భక్తికి యోగబలమెంతో ఆవశ్యకమైయున్నది.

**భక్త్యాయుక్తో యోగబలేనచైవ భ్రువోర్మధ్యే ప్రాణమావేశ్య**
**సమ్యక్ సతం పరం పురుషముపైతి దివ్యమ్** **(భ.గీ 8-10)**

భక్తితో కూడికొని, యోగబలముతో, భ్రూమధ్యములో తన ప్రాణాన్ని ప్రవేశింపజేసి, తనలోనే దివ్యపురుషాత్మను పొందుచున్నారు.

**భక్త్యాత్వనన్యయా శక్య అహమేవంవిధోఽర్జున**
**జ్ఞాతుం ద్రష్టుం చ తత్త్వేన ప్రవేష్టుం చ పరంతప (భ.గీ. 11-54)**

ఓ అర్జునా! నీకీ విశ్వరూప సందర్శనం అనన్య భక్తితోనే సాధ్యమగును. నీ యొక్క భ్రూమధ్యములో నీ ప్రాణాన్ని (ప్రాణాయామం ద్వారా) ప్రవేశింపజేసి, ఆత్మ తేజోదర్శనము చేసుకొని సకల విశ్వమునకు ఆ తేజస్సే ఆధారభూతమని తెలుసుకొనగలవు.

**తస్యాంతే సుషిరగ్ం సూక్ష్మం తస్మిన్ సర్వం ప్రతిష్ఠితమ్ (మంత్రపుష్పము)**

**బ్రహ్మనాడీ ముఖే రంధ్రం సూక్ష్మం పరమగోచరమ్**
**తస్మిన్ ప్రతిష్ఠితమ్ సర్వం విశ్వం సహ చరాచరమ్ (ఉత్తరగీత)**

మన వెన్నెముకలో వెన్నుపాముగా పిలువబడే సుషుమ్న నాడిని బ్రహ్మనాడియని యందురు. దాని అంతములో భ్రూమధ్యస్థానంలో బ్రహ్మరంధ్రం సూక్ష్మముగా గలదు. బ్రహ్మరంధ్రం ద్వారా అందు ప్రవేశింపజేసినచో ఈ చరాచర ప్రపంచమంతటినీ అచ్చట చూడవచ్చును. ఇదియే అనన్యభక్తి. కావున, బాహ్యభక్తికి యోగమును జోడించినచో అనన్యభక్తిగా మారును. ఈ యోగమనే ప్రాణాయామమును భక్తి పేరిట భాగవతం ఏకాదశస్కందంలో శ్రీకృష్ణపరమాత్మ ఉద్ధవునకు ఉపదేశించియున్నారు.

**ప్రణవ మెరుగనోడు భక్తుడెప్పుడు గాదు**
**జ్యోతినెరుగనోడు యోగి గాడు**
**నిత్యమెరుగనోడు నిర్వాణి కాడయా**
**విశ్వదాభిరామ వినురవేమ (శ్రీ యోగివేమన పద్యం)**

**రామభక్తులంచు రాతి శిలలకు మ్రొక్కి**
**భజనసేయనేల భక్తి లేక**
**భక్తి గలుగు నతడు భజనము సేయునా**
**విశ్వదాభిరామ వినురవేమ (శ్రీ యోగివేమన పద్యం)**

కావున బాహ్యభక్తికి ప్రణవ సాధన (యోగము) జోడించినచో భక్తుడు ప్రతిమారాధన చేయుచున్ననూ తన మనసు అంతర్ముఖమగుచూనే యుండును. ఈ విధంగానే నవవిధ భక్తి మార్గములు కూడా యోగసాధన ద్వారా మోక్షము నొసంగినట్లు భక్తి కథలలో మనం గ్రహించవలయును.

భక్తులుగా ప్రసిద్ధి గాంచిన ప్రహ్లాదుడు, విదురుడు, ఉద్ధవుడు, అక్రూరుడు, అర్జునుడు మొదలగువారికి శ్రీకృష్ణ పరమాత్మ యోగ జ్ఞానములను బోధించిన పిదపనే మోక్షం లభించినది. వీరందరూ బాహ్య భక్తితో ప్రారంభించి, యోగముతో అనన్య భక్తి స్థాయికి చేరి, జ్ఞానంతో ఏకాంతభక్తి యందు ప్రవేశించి మోక్షమునొందిరి. కావున,

యోగియే భక్తుడు, యోగియే కర్మయోగి, యోగియే జ్ఞాని యగును గాని, ఇవి యన్నియూ వేరు వేరు మార్గములు గావు. దీపం వెలిగించుటకు ప్రమిద, తైలము, వత్తి, అగ్ని, వెలిగించువారు అవసరమగునట్లు అన్నియూ ఒకే మార్గమునందు అంతర్భామికలైయున్నవి. అయితే యోగసాధకులు బాహ్యంగా భక్తులుగాను, కర్మయోగులు గాను, జ్ఞానులు గాను, భిన్న భిన్న రీతులలో కనిపించుచున్నారు. కొందరు యోగులు మీరాబాయి, త్యాగరాజు, చైతన్య ప్రభు, నామ్‌దేవ్, తుకారాం వంటి వారు యోగసాధనలో ఆనందపరవశులై, బాహ్యంగానే నాట్యం చేయుచూ, కీర్తనలు చేయుచూ లోకములో ప్రసిద్ధిగాంచి యున్నారు.